## క్లుప్తంగా

### నిరాశ్రయుల వసతి గృహానికి వితరణ



నిత్యావసర సరకులను అందజేస్తున్న డాక్టర్ కిషోర్స్ రత్నం విద్యార్థులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని పట్టణ నిరాశ్రయుల వసతి గృహానికి డాక్టర్ కిషోర్స్ రత్నం పాఠశాల విద్యార్థులు హ్యాండ్ టు హ్యాపీనెస్ కార్యక్రమంలో భాగంగా గురువారం రూ.50వేల విలువ చేసే నిత్యావసర సరకులను యువతరం సేవాసమితి సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ కృష్ణకిషోర్, డాక్టర్ వాసంతి, ప్రిన్సిపల్ కిరణ్, మేనేజర్ ఆచారి, విద్యార్థులు పాల్గొన్నారు.


### బాల్య వివాహాలు రూపుమాపుదాం



బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టరు శోభారాణి

నాగలాపురం: బాల్య వివాహాలను రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిచ్చాటూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ శోభారాణి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక వెస్ట్ ఎంపీపీ పాఠశాలలో బాల్య వివాహాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. యువతులకు 18 ఏళ్లు నిండిన తర్వాతే వివాహం చేయాలని చెప్పారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో బాల్య వివాహాలు జరిగితే వెంటనే 1098 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ శ్రీదేవి, అంగన్‌వాడీ వర్కర్ విజయకుమారి, హెచ్‌ఎం మాతయ్య, మహిళా సంరక్షణ కార్యదర్శి స్వేత పాల్గొన్నారు.

### వైఎస్సార్ సీపీ నాయకుడి మృతి



వెంకటరమణ మృతదేహానికి నివాళులర్పిస్తున్న నూకతోటి రాజేష్, నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాటూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు తిరుమలశెట్టి వెంకటరమణ (65) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతదేహానికి సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. రాజేష్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నాయకుడు వెంకటరమణ మృతి పార్టీకి తీరని లోటన్నారు. ఆయన కుటుంబానికి పార్టీ అండదండలు ఉంటాయని తెలిపారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. జిల్లా వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శులు మణినాయుడు, ఉగ్గుమూడి గురునాథం, ఎంపీటీసీ సభ్యులు రవి, నాయకులు పద్మనాభయ్య, మురళి, రమేష్, విష్ణు, మణి తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా ప్రపంచ మధుమేహ దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యాపకులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో గురువారం ప్రపంచ మధుమేహ దినోత్సవం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపల్ మాట్లాడారు. మధుమేహ వ్యాధి లక్షణాలు, వ్యాధి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు చంద్రమౌళి, తులసి, రమేష్ పాల్గొన్నారు.

### ఉత్తమ ఉపాధ్యాయునికి సన్మానం



శ్రీకాళహస్తి: జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు అందుకున్న తొట్టంబేడు మండల దిగువసాంబయ్యపాళెం ఉపాధ్యాయుడు కయ్యూరు బాలసుబ్రహ్మణ్యంను పాఠశాల విద్యాకమిటీ గురువారం ఘనంగా సన్మానించింది. చైర్‌పర్సన్ కల్పన మాట్లాడారు. స్కూలు అభివృద్ధి, విద్యార్థుల ఉన్నతికి కయ్యూరు చేసిన సేవలను ప్రస్తుతించారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ నిర్మల, మాజీ చైర్‌పర్సన్ దేవిక, సభ్యులు సుధాకర్, మాధవి, మోహనరాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఘనంగా సహకార వారోత్సవాలు



శ్రీకాళహస్తి: పట్టణంలోని కో–ఆపరేటివ్ టౌన్ బ్యాంకులో గురువారం 71వ అఖిల సహకార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. బ్యాంకు ఆవరణలో జెండాను ఎగురవేశారు. వికసిత్ భారత్ నిర్మాణంలో సహకార సంఘాల పాత్ర గురించి అధికారులు వివరించారు. బ్యాంకు అధికారులు ఝాన్సీ, మండల ధనంజయులు, రవి, సిబ్బంది పాల్గొన్నారు.

# పల్లెలకూ డిజిటల్ పేమెంట్ సేవలు

కొన్నేళ్ల క్రితం వరకు పెద్ద పెద్ద వ్యాపార సంస్థలు, మాల్స్‌కే పరిమితమైన డిజిటల్ లావాదేవీలు కాలక్రమంలో రోడ్ల పక్కన ఉన్న దుకాణాలతో పాటు మారుమూల గ్రామాల్లోని చిన్న చిన్న దుకాణాలకే కాదు; తోపుడు బండ్లపై చేసే వ్యాపారం, టిఫిన్, పూల అంగళ్ల దరికీ చేరాయి. ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం, భారత్‌పే తదితర క్యూఆర్ కోడ్ స్కానర్ లేకుండా ఏ వ్యాపారీ కనిపించడం లేదు. పది రూపాయలైనా సరే వీటిల్లోనూ చెల్లిస్తున్నారు. ఎవరి జేబుల్లోనూ ఇప్పుడు నగదు పెద్దగా కనిపించడం లేదు.

- గ్రామాలకు విస్తరించిన యూపీఐ ఆన్‌లైన్ చెల్లింపులు
- 50 శాతం పైగా డిజిటల్ చెల్లింపులే





ఫ్యాన్సీ స్టోర్‌లో ఏర్పాటు చేసిన పేమెంట్ క్యూఆర్ కోడ్, పూల బండిపై ఉన్న పేమెంట్ క్యూఆర్ కోడ్

బుచ్చినాయుడుకండ్రిగ: మనదేశంలో 2016లో పెద్ద నోట్లను రద్దు చేశారు. అనంతరం ఆర్థిక లావాదేవీలు పేమెంట్లను ప్రోత్సహించారు. అయితే అప్పటో అవి పెద్ద వ్యాపార సంస్థలకే పరిమితమయ్యాయి. స్మార్ట్ చెల్లింపులు గ్రామీణ ప్రాంతాలకు చేరలేదు. కోవిడ్ అనంతరం పరిణామాలతో నగదు రహిత లావాదేవీలు గణనీయంగా పెరిగి చెల్లింపుల్లో మార్పులు వచ్చాయి. పేమెంట్ యాప్‌లతో అన్నిచోట్లా ఆన్‌లైన్ చెల్లింపులు పెరిగాయి. కిరాణాలు, ఫ్యాన్సీ, మందులు, పెట్రోల్ బంకులు, ఆర్టీసీ బస్సులు, నిత్యావసర వస్తువులు తదితర దుకాణాల్లో ఆర్థిక లావాదేవీలు ఈ యాప్‌ల ద్వారానే జరుగుతున్నాయి.

**చిల్లర సమస్య నిల్**

నగదు రహిత లావాదేవీల మూలాన చిల్లర సమస్య తలెత్తడం లేదు. పేమెంట్ యాప్‌లను సంబంధించి క్యూఆర్ కోడ్‌లను ఆయా సంస్థల ఏజెంట్లు దుకాణదారులకు క్షణాల్లో అందజేస్తున్నారు. ఇప్పుడు ఏ దుకాణం వద్ద చూసిన స్కాన్ స్టిక్కర్ బోర్డులు కనిపిస్తున్నాయి.

**నియోజకవర్గంలో 12 వేలకు పైగా దుకాణాలు**

ప్రస్తుతం క్యూఆర్ కోడ్‌లు చిరు వ్యాపారులకు సైతం అందుబాటులోకి వచ్చాయి. డిజిటల్ లావాదేవీలు పెరగడంతో థర్డ్ పార్టీ నిర్వాహకులు అన్ని దుకాణాల వద్దకు వెళ్లి పేమెంట్ క్యూఆర్ కోడ్లు, స్పీకర్లు పెడుతున్నారు. సత్యవేడు నియోజకవర్గంలోని బుచ్చినాయుడుకండ్రిగ, నాగలాపురం, పిచ్చాటూరు, కేవీబీపురం, వరదయ్యపాళెం, నారాయణవనం మండలాలలో కిరాణా, ఫ్యాన్సీ, మందులు, పెట్రోల్, టీ అంగళ్లు, తోపుడు బండ్లు, ఇస్త్రీ దుకాణాలు వంటివి దాదాపు 12 వేలకు పైగా ఉన్నాయి. వీటిలో రోజుకు రూ .2 వేల నుంచి రూ. 50 వేల వరకు లావాదేవిలు జరుగుతున్నాయి. వీటిలో 50 శాతం వరకు డిజిట్ పేమెంట్లు అవుతున్నట్టు ఒక అంచనా. స్కానర్ ద్వారా చెల్లింపు సేవలు కంపెనీ లు ఉచితంగా అందిస్తున్నాయి. స్పీకర్ బాక్స్ పెడితే కంపెనీలను బట్టి మినిమం చార్జీలు ఉంటాయి. ఇందుకు నెలకు రూ.120 వరకు వ్యాపారులు చెల్లిస్తున్నారు.

**స్పీకర్‌తో మోసాలకు అడ్డుకట్ట**

డిజిటల్ పేమెంట్స్‌లో ఈ మధ్య స్పీకర్ సిస్టం రావడంతో మోసాలకు అడ్డుకట్ట పడింది. ఎక్కువ మంది ఒకేసారి వచ్చినప్పుడు డిజిటల్ పేమెంట్స్ చేసినట్లు ఫోన్‌లో చూపితే సరే అనేవాళ్లం. తీరా రాత్రికి చూసుకుంటే డబ్బులు జమ కాక లబోదిబోమనేవాళ్లం. ఇప్పుడు స్పీకర్ పెట్టడంతో పే చేసిన సొమ్ముకు సంబంధించి వెంటనే తెలుగులో చెబుతుంది. దీంతో అక్రమాలు జరిగే అవకాశం లేదు.

– చంద్రశేఖర్‌శెట్టి, చిల్లర అంగడి వ్యాపారి, బుచ్చినాయుడుకండ్రిగ

**పెరిగిన వ్యాపారం**

డిజిటల్ పేమెంట్ సేవలు వచ్చినప్పటి నుంచి వ్యాపారం బాగా పెరిగింది. గతంలో చిన్న వస్తువులు కొనుగోలుదారుడు కొంటే దానికి సరిపడా చిల్లరతో సమస్య ఉండేది. ఇప్పుడు చాలా వరకు డిజిటల్ పేమెంట్ చేస్తున్నారు. దీంతో చిల్లర సమస్య తీరడంతో పాటు వ్యాపారాలు కూడా పెరిగాయి.

– మోహన్, ఫ్యాన్సీ వ్యాపారి, నీర్పాకోట

# వ్యక్తిగత శుభ్రత పాటించాలి



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ బేబీ

నారాయణవనం: కిషోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శశికళ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బేబీ పేర్కొన్నారు. గురువారం బాలికల ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ బాలల దినోత్సవాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కిషోర దశలో ఆరోగ్యంతోపాటు పారిశుధ్యానికి ప్రాధాన్యత చూపాలని అన్నారు. బహిష్టు సమయంలో న్యాప్‌కిన్లు తప్పనిసరిగా వాడాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాల్లో కిషోర బాలికలకు ఉచితంగా న్యాప్‌కిన్లు అందిస్తున్నామని తెలిపారు. రక్తహీనతకు గురికాకుండా ఐరన్ శాతాన్ని పెంచుకునే పోషక పదార్థాలను ఆహారంలో చేర్చుకోవాలని అన్నారు. బాల్య వివాహాలతో అనారోగ్యంతో పిల్లలు పుట్టడం, తల్లి ఆరోగ్యం క్షీణిస్తుందని తెలిపారు. బాల్య వివాహాల సమాచారాన్ని ఉపాధ్యాయులకు, అంగన్‌వాడీ సిబ్బందికి తెలిపి బాలికల జీవితాలను కాపాడేందుకు సహకరించాలని వారు అన్నారు. పైకార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వంతెన పునర్నిర్మించండి



గోవర్ధనపురం వంతెన వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నేతలు

వరదయ్యపాళెం: స్థానిక గోవర్ధనపురం వద్ద మారేడు కాలువ లోలెవల్ వంతెనను పునర్నిర్మించాలని నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి అంబాకం చిన్నిరాజ్ డిమాండ్ చేశారు. వంతెన పూర్తిగా మరమ్మతులకు గురై వాహన రాకపోకలకు ఇబ్బందికరంగా మారడంతో సీపీఐ నాయకులు గురువారం వంతెన వద్ద అందోళన చేశారు.. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ రాకపోకలను అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. తక్షణమే వంతెనకు మరమ్మతులు చేపట్టి ఆ ప్రాంతంలో శాశ్వత ప్రాతిపదికన హైలెవల్ వంతెన నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో సీపీఐ నేతలు ఆందోళన విరమించారు. మండల కార్యదర్శి తరుణ్ కుమార్, సీపీఐ నాయకులు సిద్ధలయ్య, బాలగురునాథం, మునిచంద్ర, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

# చట్టాలపై ఎంపేడులో అవగాహన సదస్సు



సదస్సులో ప్రసంగిస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని ఎంపేడులో గురువారం సీఐడీ ఇన్‌స్పెక్టర్ రంగస్వామి ఆధ్వర్యంలో ఎస్సీ అండ్ ఎస్టీ పీఓఏ యాక్ట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్సీ ఎస్టీ సెల్ డీఎస్పీ నరసింగప్ప, శ్రీకాళహస్తి రూరల్ సీఐ ఎం.రవి నాయక్, ఎస్సీ కార్పొరేషన్ డీడీ చెన్నయ్య, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ సూర్యానారాయణ, ఎంపీడీఓ పటాన్ రఫ్ఖాన్ మాట్లాడారు. విద్యార్థి దశ నుంచి భారత రాజ్యాంగం, ఎస్సీ ఎస్టీ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. తద్వారా బడుగులపై జరిగే అరాచకాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. అనంతరంపై చట్టాలకు సంబంధించిన అవగాహనపై ప్రతిభ కనబరచిన ముగ్గురికి బహుమతులు అందజేశారు. అతిథులకు సీఐడీ అధికారులు జ్ఞాపికలు అందజేశారు. ఎస్ఐ బాబా ఫక్రుద్దీన్, ప్రగతి ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్లు నారాయణ, ప్రభాకర్, ప్రగతి ప్రాజెక్టు కో–ఆర్డినేటర్లు, మాజీ ఎంపీపీ ఈశ్వర్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అంతర్‌దృష్టితో విభిన్న ఉత్పత్తులు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ మల్లికార్జున

రేణిగుంట: ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా అంతర్‌దృష్టితో వినియోగదారుల అభిరుచికి అనుగుణమైన విభిన్న ఉత్పత్తులను తయారుచేయవచ్చని తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ విభాగపు డైరెక్టర్ ప్రొఫెసర్ పి.మల్లికార్జున అన్నారు. మండలంలోని గాజులమండ్యం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఉన్న ఇండోమిమ్ పరిశ్రమను ఆయన గురువారం విద్యార్థులతో కలసి సందర్శించారు. పరిశ్రమల నిబంధనలకు అనుగుణంగా సాంకేతిక పద్ధతులను వినియోగించుకుని కొత్త ఆవిష్కరణపై దృష్టి సారించాలన్నారు. కర్మాగారంలో తయారయ్యే మెటల్ ఇంజక్షన్ మోల్డ్‌లను విద్యార్థులు పరిశీలించారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీ కో–ఆర్డినేటర్లు పి.వింధ్య, డి.రాజేంద్ర, వీరారెడ్డి, పరిశ్రమ అధికారులు శ్రీనివాసులు, కోటేశ్వరరావు, నవీన్‌కుమార్, లోకానందన్ పాల్గొన్నారు.

### పాఠశాలకు కలర్ ప్రింటర్ వితరణ



ప్రింటర్ అందజేస్తున్న రెడ్ల వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

శ్రీకాళహస్తి: బాలల దినోత్సవం పురస్కరించుకుని తొట్టంబేడు మండలం గుండేలిగుంట జెడ్పీ హైస్కూల్‌కు గురువారం శ్రీకాళహస్తి రెడ్డీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కలర్ ప్రింటర్‌ను ప్రధానోధ్యాయులు తిరుమలయ్యకు అందజేశారు. దాతలకు హెచ్‌ఎం కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు చెంచురెడ్డి, ఉపాధ్యాయులు చెంచయ్య, మునీశ్వర్‌రెడ్డి, సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం



సీసీ రోడ్డు పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

నారాయణవనం: అభివృద్ధి పనులలో నాణ్యతకు ప్రాధానమిచ్చి సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ సుచించారు. గురువారం సాయంత్రం ఆయన మండలంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపడుతున్న పనులపై అధికారులతో సమీక్షించారు. పాలమంగళం దక్షిణపుకండ్రిగ బీసీ కాలనీలో పనులు పూర్తి అయిన సీసీ రోడ్డును డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాల మేరకు సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి చేయాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. సక్రమంగా విధులను నిర్వహించాలని అన్నారు.

# హామీలు నెరవేర్చని కూటమి ప్రభుత్వం



ఆర్డీఓ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు



బుచ్చినాయుడుకండ్రిగ తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

శ్రీకాళహస్తి:/బుచ్చినాయుడుకండ్రిగ: ప్రజాసమస్యల పరిష్కారం, ఎన్నికల హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీపీఎం శ్రీకాళహస్తి ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి, సీపీఎం జిల్లా నాయకుడు పుల్లయ్య, మండల కార్యదర్శి రమణయ్య విమర్శించారు. ప్రజాపోరు ముగింపు సందర్భంగా శ్రీకాళహస్తిలో ఆర్డీఓ కార్యాలయం, బీఎన్ కండ్రిగ తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నిత్యావసర సరకుల ధరలు ఆకాశాన్నంటాయన్నారు. విద్యుత్ ట్రూ అప్ చార్జీల పేరిట ప్రజలపై బాదుడు మొదలెట్టిందని, పదేళ్లకు సరిపడా రూ.17వేల కోట్లు భారం మోపేందుకు సిద్ధమైందన్నారు. ఆదాయానికి తలొగ్గి స్మార్ట్‌మీటర్ల పేరిట ఉచిత విద్యుత్‌కు మంగళం పాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇసుక దోపిడీ ఆగలేదని తెలిపారు. సూపర్‌సిక్స్ పథకాలు అంతంతమాత్రమేనని చెప్పారు. మహిళలపై లైంగిక వేధింపులు, అత్యాచారాలు, హత్యలను అరికట్టడంలో విఫలమైందని దుయ్యబట్టారు. అనంతరం ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డి, తహసీల్దార్ సుబ్రమణ్యంకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కుమార్, వెంకటయక్య, వేణు, రాధమ్మ, గురునాథం, అన్వర్‌బాషా, గురవయ్య, ప్రసాద్, సుబ్రహ్మణ్యం, వెలివేంద్రం పాల్గొన్నారు.

# ఉచితంగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు



క్యాన్సర్ పరీక్షల స్క్రీనింగ్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జిల్లా లెప్రసీ, టీబీ అధికారి డాక్టర్ శ్రీనివాసులు

సత్యవేడు: స్థానిక కమ్యూనిటీ వైద్యశాలలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల స్క్రీనింగ్ కార్యక్రమాన్ని జిల్లా లెప్రసీ, టీబీ అధికారి డాక్టర్ శ్రీనివాసులు గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల ద్వారా వ్యాధి లక్షణాలు ఉన్న వారిని ప్రాథమికంగా గుర్తిస్తామన్నారు. ఏఎన్‌ఎంలకు సర్వేపై అవగాహన కల్పించామన్నారు. ఏఎన్‌ఎంలు రోజుకు ఐదు ఇళ్లు చొప్పున సర్వే చేస్తారన్నారు. క్యాన్సర్ ఉన్న వారిని వైద్యశాలకు తరలించి ఉచితంగా వైద్యపరీక్షలు అందిస్తారన్నారు. కమ్యూనిటీ వైద్యశాల వైద్యులు డాక్టర్ సురేష్, దాసుకుప్పం పీహెచ్‌సీ డాక్టర్ గుణశేఖర్, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈఓ కె.రవి, ఎంపీహెచ్‌ఈఓ సుబ్రమణ్యం, హెల్త్ అసిస్టెంట్ షణ్ముగం, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

# త్వరితగతిన అసంక్రమిత వ్యాధుల సర్వే



నీర్పాకోటలో సర్వేను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మృదేలవాణి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో అసంక్రమిత వ్యాధుల ఇంటింటి సర్వేను విజయవంతం చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మృదులవాణి ఆదేశించారు. గురువారం ఆమె నీర్పాకోటలో అసంక్రమిత వ్యాధుల ఇంటింటి సర్వేను ఆకస్మిక తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ అసంక్రమిత వ్యాధులైన డయాబెటిక్, హైపర్ టెన్షన్, క్యాన్సర్, పక్షవాతం, థైరాయిడ్ నిర్ధారించడానికి ప్రభుత్వం ఇంటింటా సర్వే ప్రారంభించిందన్నారు. భారతదేశంలో సంవత్సరానికి 10 లక్షల మంది క్యాన్సర్ వ్యాధితో మరణిస్తున్నారని, ఇలాగే ఉంటే 2026 నాటికి 20 లక్షల మంది క్యాన్సర్‌తో చనిపోయే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ సర్వేలో ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ అసంక్రమిత పరీక్షలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి దివాకర్, ఆరోగ్య అధికారి వెంకటేశులు, సూపర్‌వైజర్ జ్యోతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# సామాజిక అవగాహన పెంచుకోవాలి



రేణిగుంట బాలికోన్నత పాఠశాలలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ జయలక్ష్మి

రేణిగుంట: ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే సామాజిక అవగాహన పెంచుకోవాలని మహిళాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ జయలక్ష్మి అన్నారు. జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గురువారం రేణిగుంట బాలికోన్నత పాఠశాలలో బాలల దినోత్సవం, అంతర్జాతీయ బాలల హక్కుల వారోత్సవాల్ని ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సామాజిక విషయాల పట్ల అవగాహన పెంచుకుని స్వీయ రక్షణ పద్ధతులు పాటించాలన్నారు. ఏదైనా విపత్కర సమస్యలు ఎదురైనపుడు కుటుంబం, పాఠశాల సిబ్బందికి తెలియజేసి పరిష్కారం పొందాలన్నారు. రేణిగుంట సీడీపీఓ కృష్ణమంజరి మాట్లాడుతూ పిల్లలు మొబైల్ వ్యసనానికి దూరంగా ఉండాలన్నారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి వీ.శివశంకర్ మాట్లాడుతూ ఎవరైనా పిల్లలు ఒంటరిగా కనిపిస్తే 1098కు ఫోన్ చేస్తే సంబంధిత శాఖల అధికారయంత్రాంగం స్పందిస్తుందన్నారు. బాలాజీ బాలవికాస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ రమేష్ రెడ్డి, ప్రగతి సంస్థ డైరెక్టర్ రమణ, హైస్కూల్ హెచ్‌ఎం విష్ణువర్ధనం, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ హేమావతి పాల్గొన్నారు.

## కేటీరోడ్డుపై కూలిన భారీ వృక్షం



రోడ్డుపై కూలిన వృక్షం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కంచనపుత్తూరు గ్రామ సమీపంలో కేటీరోడ్డుపై గురువారం కురిసిన వర్షానికి భారీ వృక్షం నేలకూలింది. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రోడ్డుపై రెండు వైపులా వాహనాలు బారులు తీరాయి. సుమారు రెండు గంటల పాటు వాహనరాకపోకలు నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఇది తెలుసుకున్న పోలీసులు చెట్టును నుంచి తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

# గ్రంథ పఠనం అలవరచుకోవాలి





గ్రంథాలయంలో సరస్వతీ పూజ, రేణిగుంట: వారోత్సవాలను ప్రారంభిస్తున్న గ్రంథాలయాధికారిణి



శ్రీకాళహస్తి: నెహ్రూ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

నారాయణవనం: పాఠశాల స్థాయి నుంచే గ్రంథ పఠనాన్ని దినచర్యగా అలవరచుకోవాలని విశ్రాంత ఎంపీడీఓ శ్రీనివాసులు కోరారు. 57వ గ్రంథాలయ వారోత్సవాలను స్థానిక లైబ్రరీలో గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలలో విషయ పరిజ్ఞానాన్ని పెంచుకునే అవకాశం ఉంటుందని అన్నారు. గ్రంథాలయ అధికారి జీవన్ మాట్లాడుతూ రోజూ స్థానిక పాఠశాల్లో విద్యార్థులకు పోటీలను నిర్వహించి, బహుమతులను అందజేస్తున్నట్లు తెలిపారు. .

**రేణిగుంటలో..**

రేణిగుంట: గ్రంథాలయాలు జ్ఞాన భాండాగారాలని రేణిగుంట గ్రంథాలయాధికారిణి ఏ.శ్రీముఖి అన్నారు. గురువారం రేణిగుంట శాఖా గ్రంథాలయంలో ప్రారంభమయ్యాయి. బాలల దినోత్సవం సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పిల్లలకు చాక్లెట్లు పంచారు. పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. రేణిగుంట బుగ్గవీధి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం అరుణమ్మ, త్యాగరాజులు, వెంకటరత్న, కస్తూరమ్మ, పుష్పలత పాల్గొన్నారు.

**శ్రీకాళహస్తిలో..**

శ్రీకాళహస్తి: పట్టణంలోని గ్రంథాలయంలో వారోత్సవాలను ప్రారంభించారు. అలాగే నెహ్రూ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంఈవో భువనేశ్వరి, గ్రంథాలయ అధికారి, పాఠకులు పాల్గొన్నారు.

# ఘనంగా బాలల దినోత్సవం





బుచ్చినాయుడుకండ్రిగ: కల్లివెట్టులో నివాళులర్పిస్తున్న ప్రధానోపాధ్యాయుడు రూపేష్‌కుమార్, శ్రీకాళహస్తి రూరల్: బీవీపురంలో..



శ్రీకాళహస్తి: మాట్లాడుతున్న న్యాయమూర్తి బేబీరాణి





బాలల హక్కులను పరిరక్షించాలని ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కల్లివెట్టు, బుచ్చినాయుడుకండ్రిగ గ్రామాల్లోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం బాలల దినోత్సవాన్ని ప్రధానోపాధ్యాయులు రమణయ్య, రూపేష్‌కుమార్ ఘనంగా నిర్వహించారు. జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఘనంగా నివాళులర్పించారు. కనమనంబేడు గ్రామ ప్రాథమిక పాఠశాలలో వ్యాసరచన, ఆటల పోటీలలో విజేతలకు ఎంఈఓ–2 మునిసుబ్రమణ్యం, టీచర్లు కళ్యాణి, సురేష్ బహుమతులను ప్రదానం చేశారు.

**విద్యార్థులకు స్వీట్లు పంపిణీ**

నాగలాపురం: బాల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో 600 మంది విద్యార్థులకు సీఆర్‌సీ శివయ్య సౌజన్యంతో పిల్లలకు స్వీట్లు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు కస్తూరయ్య పాల్గొన్నారు.

**శ్రీకాళహస్తిలో..**

శ్రీకాళహస్తి: స్థానిక భాస్కరపేట పురపాలక సంఘ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ముఖ్యఅతిథిగా శ్రీకాళహస్తి న్యాయస్థాన సీనియర్ సివిల్ జడ్జి బేబీరాణి మాట్లాడారు. చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. న్యాయవాదులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..**

పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలను నిర్వహించా రు. ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ బత్తెయ్యనాయుడు పూలమాల వేసి నివాళులు అర్పించారు.

**ఓబులాయపల్లె, బీవీపురంలో..**

శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని ఓబులాయపల్లె, బీవీ పురం పాఠశాలల్లో ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం నిర్వహించారు. సంస్థ కో–ఆర్డినేటర్ ప్రభాకర్ మాట్లాడారు. విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలను నిర్వహించి సర్టిఫికెట్లను అందజేశారు. హెచ్‌ఎం సాదిక్‌బాషా, రామచంద్ర పాల్గొన్నారు.

**బాలల హక్కుల సంరక్షణ అందరి బాధ్యత**

రేణిగుంట: బాలల హక్కుల సంరక్షణ అందరి బాధ్యతని ఎస్‌వోఎస్ బాలల గ్రామం ప్రతినిధి డి.ప్రథిమ అన్నారు. గురువారం ఏర్పేడు మండలం పల్లం హైస్కూల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. బాలల హక్కులు, వాటి పరిరక్షణపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం టి.ఆనంద్, మునిరత్నం పాల్గొన్నారు.